# పురుషులందు పుణ్యపురుషులెవరు?

కంచుమర్తి వెంకటేశ్వరరావు

"శారదా దేవి ఏం చెప్పారో తెలుసా పురుషులను ఎన్నడూ నమ్మవద్దు.. ఇతరుల విషయమటుంచి తండ్రైనను, సోదరుడైనను నమ్మరాదు ఆఖరికి పురుషరూపం దాల్చి వచ్చిన భగవంతుడిని కూడా .

దీనికి అర్థం ఏమిటి?

దేహాత్మ బుద్ధి నిలిచి యున్నంతవరకు కామాతురత నిలిచియుండడం వలన పతనం తప్పదు "

మంత్ర ముగ్ధుడిలా భారతి చెబుతున్నది వింటూ అలాగే కూర్చుండి పోయాడు మధు బాబు. పాతికేళ్ళ సౌందర్యరాశిలో దాగియున్న తెలివి తేటలు, వాగ్ధాటి ముందు ఎవరూ నిలబడలేరు ఆమెతో మాట్లాడుతుంటే ఎన్నో విషయాలు తెలుసుకోవాలన్న తపన కలుగుతుంది

'భారతీ.. నీవు చెప్పిందానికి ఒప్పుకుంటాను కానీ మనసులో పేరుకు పోయిన ఈ కామాతురతను మనిషి నుండి వేరు చేయగలమా?"

అతని ప్రశ్నకు భారతి చిన్నగా నవ్వి, "వేరు చేయవచ్చు గానీ అది చెప్పడమంత సులభం కాదు ఆచరణలో"

"అంత కష్టమా . "

"అ౦ ఒక్కటే మార్గం. పురుషులు స్త్రీలనందరను ' తల్లులుగానూ, స్త్రీలు పురుషులను తమ బిడ్డలుగా భావించాలి."

ఖంగుతిన్నాడు మధు బాబు

ముఖం పాలిపోయింది. అతని ఇబ్బంది గమనించిన భారతి మరింత గట్టిగ నవ్వింది.

'చూడు మధూ ... మీ మగాళ్ళలో ఏ ఒక్కరికి ఇది సాధ్యంకాదు. ఎందుకంటావా? స్త్రీని తమ కోర్కెలకు సాధనంగా వాడుకునే బుద్ధి మీ నరనరాల్లో జీర్ణించుకు పోయింది. స్త్రీని చూడగానే మీ రక్తం సలసల కాగుతుంది. యువకులకే కాదు చావడానికి సిద్ధంగా ఉన్న ముసలోళ్ళకు కూడా, ..."

ఈ సారి మధు బాబుకు కోపం వచ్చింది

ముసలాళ్ళను ఎందుకు కలుపుతావ్ "

అన్నాడు చిరాగ్గా

"ఏం.. వాళ్ళకా ఇది ఉండదా! తల్లి గర్భము నుండి వచ్చిన బాలుడికి కొంత వయసు వచ్చే సరికి మనసు, గుణములు వెయ వెరుగ మారుతాయి యవ్వన దశలో అన్ని భోగములు అనుభవించి చివరకు శరిర బలము తగ్గి , దంతములూడి, చూపు తగ్గి, నడుము వంగి చేతి కర్ర పట్టుకుని రేపో మాపో చావడానికి సిద్ధంగా ఉన్న ఆ ముసలాడి కామము ఇరవై ఐధేళ్ళ వాడికున్నంత ఉంటుంది .

ఒక ఉదాహరణ చెప్పనా

తాతా . తాతా నన్ను పెళ్ళి చేసుకుంటావా అని ఒక బాలిక అడిగితే "ఈ వయసులో నా కెందుకమ్మా" అని అనడు ముసి ముసిగ బోసినవ్వులు నవ్వుతూ , 'నాకెవరు పిల్లనిస్తారే" అంటాడు అంటే పిల్లనిస్తే పెళ్ళికి రడి అన్నమాట ఇదే ఇచ్ఛ... అంటే కావాలనున్నది దీన్నే కామం... మరో విధంగా చెప్పాలంటే ఆశ

ఈ ఆశ కలగడానికి గల కారణం.... జన్మ జన్మములకు ఈ ఆశ అతని వెంట వస్తుంటుంది ఈ కామము (ఆశ)తో నిండిన వృద్ధుడు మరణించినా (మృత్యువు శరిరమునకు గాని ఆత్మకుకాదు) జీవుడును, అతన్ని అనుసరిస్తూ వస్తున్న ఆశయును మరో తల్లి గర్భములోకి చేరుతాయి. మరల పుట్టి కొన్ని సంవత్సరాల వరకు దాగియుండి బాల్యదశ దాటి యవ్వన దశకు చేరేసరికి ఈ కామము మరల విజృంభించును

అంటే ఈ కామము (ఆశ) జన్మ జన్మాలకు జీవులను వెంబడిస్తూనే ఉంటుంది దీన్ని జయించాలంటే తలంపులు లేకుండా చూసుకోవాలి... ఇంద్రియ, మనో బుద్ధులను అణచి జ్ఞానమును నాశనం చేసే ఇచ్ఛను వదలాలి "

పిచ్చెక్కి నట్లయింది మధుబాబుకు

భారతితో మాట్లాడం కష్టం

టాపిక్ మార్చడానికి ప్రయత్నించాడు

"భారతీ నాదొక చిన్న అనుమానం. . నీ భర్త పెట్టిన బాధలకు దూరంగా ఒంటరిగా ఉంటున్నావా.. లేదా నీ వాగ్ధాటికి భయపడే నీ భర్త నిన్ను బయటకు పంపించాడా.. "

అప్రయత్నంగా మధుబాబు నోట్లోంచి వచ్చేసాయ్ ఆ మాటలు. తర్వాత నాలిక్కరచుకున్నాడు.

భారతి గొంతు మరి పెగలలేదు...

ఆమెకళ్ళు నీటితో నిండిపోయాయి.

అరగంట వరకూ తేరుకో లేక పోయింది అప్పటికే మధుబాబు వెళ్ళిపోయాడు. తను భర్తను విడిచిపెట్టి వచ్చేసానా!

ఏ గతాన్నైతే మరచిపోయి తనకంటూ ఓ అందమైన జీవితాన్ని సృష్టించుకోవాలని రెండేళ్ళ నుండి తపిస్తుందో ఆ గతం మరోసారి భారతి కళ్ళముందు మెదిలింది

* * * * *

"వివాహ సమయంలో మంగళ సూత్రమును వధువు కంఠమున కట్టకముందు వధూవరుల మధ్య ఒక తెర వేస్తారు. . బ్రాహ్మణులు "సావధాన... సావధాన" అని గట్టిగ పలికి తర్వాత "ఇతి సులగ్న సావధాన" అని అంటారు.. అంటే... ఇప్పుడొక రక్కసి వచ్చి నీ కంఠమున పడబోవు చున్నది కనుక నీవు సావధానుడవై యుండి తప్పించుకొనుము" అని హెచ్చరిక చేయు చున్నారు

పురుషులు, స్త్రీలపై ఉండె మోహము వలన ఆమెను తమ వశము చేసుకుని యెచ్చుటకును పారిపోనీయక తమవద్దనే యుండుటకు మొదట మంగళ సూత్రమను పాశమును కడతారు. ఈ త్రాడుకు లొబడదనే భయంతో నవరత్నములు పొదిగించి తయారు చేయబడిన బంగారు నగలనెడి అనేక త్రాళ్ళను మెడకు హస్తములకు, పాదములకు తగిలిస్తారు. అప్పటికీ ఆమె స్వాధీన పడునను నమ్మకం లేక వడ్డాణమను పేరుతో తాటాకు వెడల్పు గల బంగారు పట్టడను నడుముకు, బులాకీ అను పేరుతో ఒక ముక్కుతాడు ముక్కుకు, మొగము ఇటూ అటూ త్రిప్పకుండా ఉండడానికి కమ్మలు, బావిలీలు అనునవి చెవులకు, అతి సంభాషణ చేయకుండా కెంపులతో, రవ్వలతో చెక్కిన అడ్డిగ(నాను) కట్టిదరు. ..

ఇవి పూర్వకాలంలో స్త్రీకి పురుషుడు బిగించే సంకెళ్ళు. ఈ తరంలో స్త్రీకి ఎటువంటి త్రాళ్ళనూ కట్టడం లేదు సింపుల్‌గ మూడు ముళ్ళు వేసి తనదాన్ని చేసుకుంటున్నాడు. తన కోర్కెలకు సాధనంగా, తన పనులకు దాసిగా, తన పిల్లలకు తల్లిగా మార్చుకుంటున్నాడు. . ఇంత వరకూ ఫరవాలేదు.. మూర్ఖులైన కొందరు తమ దురలవాట్లతో భార్యలను శారీరకంగా, మానసికంగా చిత్ర వధకు గురి చేస్తున్నారు ఇది నేటి స్త్రీ ఎదుర్కొంటున్న సమస్య ..

ఈ సమస్యల వలయం నుండి తప్పించుకుని తన కాళ్ళ మీద తను నిలబడ గల సామతను సంపాదించుకుని అడుగు ముందుకు వేయాలి . అప్పుడే స్త్రీ పురుషుడితో సమానంగా సుఖమయ జీవనం గడపగలదు "

భారతి ప్రసంగం అందరినీ ఆకట్టుకుంది.

మొదటి బహుమతి గెలుచుకుంది.

తాలూకాఫీసులో హెడ్‌క్లర్క్ రామనాథం గారి అమ్మాయి భారతి. పేరుకు తగ్గట్టు చదువుల సరస్వతి... అందం, చదువు, సంస్కారం పోటీకి పుచ్చుకున్న భారతంటే అందరికి అభిమానం.

ఆ సంవత్సరం డిగ్రి పూర్తయింది ఇంకా చదవాలనే కోరిక ఉన్నా ఇద్దరు నిరుద్యోగులైన అన్నయ్యలతో, ఇంటర్ చదువుతున్న చెల్లెలుతో భారంగా కుటుంబాన్ని నెట్టుకొస్తున్న తండ్రికి శక్తికి మించిన పని... అదిగాక ఈ సంవత్సరం భారతి పెళ్ళి చేసెయ్యాలనేదే రామనాధం గారి ఆలోచన ఎవరే సబంధం గురించి చిన్న కబురు చెప్పినా వెళ్ళి చూసి వస్తున్నారు

తండ్రిని బాధ పెట్టడం ఇష్టంలేక భారతి ఏం మాట్లాడలేదు.

మరో ఆరు నెలలకు భారతి పెళ్ళి విశ్వంతో జరిగిపోయింది. భారతి జీవితంలో మరో క్రొత్త మలుపు . రెండు నెలల సంసారంతో భారతికి విశ్వం యొక్క అసలు స్వరూపం తెలిసింది

"మీకిది ఎన్నో పెళ్ళి."

అడిగిందొక రోజు

"నేను రాజును కాను... ఒక్కసారే పది మందిని మెయిన్‌టిన్ చేయడానికి అయితే మగాడిగా ఓ భార్య చనిపోతే మరేక పెళ్ళి చేసుకునే హక్కు నాకుంది."

"నా నెంబరెంత "

"మూడు "

"ఆ ఇద్దరు చనిపోయారా.. లేక మీరు పెట్టే బాధలు భరించలేక మిమ్మల్ని విడిచి పెట్టి వెళ్ళిపోయారా "

"మొగుడి బాధలకు తమ దారి తము చూసుకునే ధైర్యం ఇంకా మీ స్త్రీ జాతిలో రాలేదు.. ఆత్మహత్య చేసుకున్నారు "

ఆ రాత్రి కుమిలి కుమిలి ఏడ్చింది భారతి.

చూడ్డానికి సంస్కారమున్న వాడని భ్రమపడి వెనుకా ముందు ఆలోచించకుండా పెళ్ళి జరిపించారు . జరిగిందేదో జరిగిపోయింది. తన కర్తవ్యం ఏమిటి? బ్రతకినంత కాలం ఈ నరకం అనుభవించాలా?

ఒక సంవత్సరం గిర్రున తిరిగిపోయింది...

ఆ రోజు . భారతి ఊహించని రోజు

ఎప్పుడో డిగ్రి చదువుతుండగా సర్వీస్ కమిషన్ పరీక్ష రాసింది ఆ సంగతే మరచిపోయింది.. ఉదయం పోస్టుమన్ ఇచ్చిన రిజిష్టర్డ్ కవర్ చూసి ఆశ్చర్యపోయింది ఎపాయింట్‌మెంట్ ఆర్డరది..

భారతి ఆనందానికి అవధులు లేవు.

"పైసా సంపాదన లేనప్పుడే నా మీద విరుచుకు పడుతున్నావ్ నాతో సమానంగా ఉద్యోగం చేస్తే నా మాట వింటావా అందుకే నువ్వు ఉద్యోగం చేయుడానికి వీల్లేదు

విశ్వం అలా అనగానే తల తిరిగిపోయింది భారతికి

'చూడండి . అవకాశం వచ్చినప్పుడు ఉద్యోగం చేయడం తప్పేం కాదు అయినా ఇది నా వ్యక్తిత్వానికి సంబంధించింది చేయవద్దని శాసించే అధికారం మీకు లేదు "

"సరే ఒక షరతు మీద ఒప్పుకుంటాను... నా జీతం గురించి అడగవద్దు నా ఖర్చులను పాయింటవుట్ చేయకూడదు నీ జీతంతో, అప్పుడప్పుడు నేనిచ్చే చిల్లరతో ఇంటిని నడిపించాలి నీ జీతంలో ఒక్క రూపాయి కూడా నాతో చెప్పకుండా ఖర్చు పెట్టడానికి వీల్లేదు "

కొయ్యబారిపోయింది భారతి

ఇటువంటి భర్తతో కాపురం చెయ్యాలా?

రెండ్రోజుల తర్వాత

"తక్కువ జీతగాడితో సర్దుకుపోవచ్చు గానీ క్షణం క్షణం మాటలతో, చేతలతో నరకం చూపించే మీలాంటి మగాళ్ళ దగ్గర వ్యక్తిత్వమున్న ఏ ఆడది బ్రతకలేదు . నా కంటి ముందు ఇద్దరు మీ జీవితంలోకి ప్రవేశించి ఎందుకంత తొందరగా దూరమయ్యారో ఇప్పుడే పూర్తిగ తెలిసింది. ఇకపై ఏ ఆడదీ మిమ్మల్ని పెళ్ళి చేసుకోదు "

అనేసి పెట్టి సర్దుకుని బయటకు వచ్చింది భారతి

మరో ఊరులో ఉద్యోగం

అదే ఆఫీసులో పని చేస్తున్న మధుబాబుతో పరిచయం పెళ్ళికానివాడు ఏ భాధలూ లేనివాడు. ఆప్యాయంగా పలుకరించే మధుబాబులోని మంచితనం ఒంటరి భారతికి రిలాక్స్ నిచ్చాయి

రోజులు నెలలు గడిచిపోతున్నాయి

సెలవు రోజుల్లో అనేక విషయాల మీద భారతి, మధుబాబు చర్చించుకునే వాళ్ళు ఏ విషయంలోనూ భారతిని ఓడించలేక పోయేవాడు మధుబాబు

ఒకరోజు

"భారతీ సంప్రదాయం ఆచారం విటిలో గల మహత్యం, అద్భుతం ఏముందో నాకు తెలియదు గానీ ఒక్క విషయం మాత్రం ఒప్పుకోక తప్పదం లేదు ఆడది అంతరిక్షంలోకి వెళ్ళేటంత ఎత్తుకు ఎదిగినా తనొక ఆధారంతో, తనొక నీడలో బ్రతకాలనుకుంటుంది ఎదురయ్యే సమస్యలను ఎదుర్కొడానికి సిద్ధపడినా ఆమె మనసు పొరలలో ఏ కొద్ది స్థలమైనా ఈ ఆచార సంప్రదాయాలకు కేటాయిస్తుంది '

మధుబాబు మాటలేం అర్థం కాలేదు భారతికి


"నీవు నేర్చిన విద్యే నా మాటలు నీకు బోధ పడలేదంటే ఆశ్చర్యమే నీ మెడలోని ఆ గొలుసేమిటో చెప్పగలవా "

భారతి చేతో తడుముతుంది

మంగళసూత్రం..

తన మెడలో ఇంకా ఉందా అనుకుంది.

'దుర్మార్గుడైన భర్తతో సంసారం చేయలేక నీ కాళ్ళ మీద నిలబడగల అందమైన జీవితం



సంపాదించావు అన్ని బంధాలు త్రెంచుకున్నా మెడలో ఉన్న దాన్ని తీసి వేయలేకపోతున్నావు అంటే రక్షణ కోసమా లేక అదంటే గౌరవమా ధైర్యంతో భర్తను ఎదిరించడంతో నే సరిపోయిందా జీవితాంతం ఒంటరిగా ఉండిపోవడం గొప్పతన మనుకుంటున్నావా "

భారతి జవాబివ్వలేదు సూటిగా తన కళ్ళల్లోకి చూస్తున్న మధుబాబు ముఖంలో ఆ రోజు భారతికి కొత్త కొత్త భావాలు కనిపిస్తున్నాయి.

క్షణంసేపు ఆలోచించి భారతి చిన్నగా నవ్వి మెడలోంచి తాళిని తీసింది

* * * *

గతంలోంచి వాస్తవానికి వచ్చింది భారతి

అప్పటికే చీకటి పడింది

ఆ చీకటిలో నే భారతి కళ్ళల్లో వెలిగిందొక వెలుగు రేఖ

* * * *

రెండ్రోజుల తర్వాత

"అయాం సారీ భారతీ అప్రయత్నంగా నా నుండి ఆ మాట వచ్చేసింది నువ్వు క్షమించానంటేనే ముఖాముఖిగా మాట్లాడుతాను నీ దగ్గరకు రావాలంటే భయంగా ఉంది "

ఆఫీసులో తన సీట్లో కూర్చున్న భారతికి అటెండరు ద్వారా ఆ లెటరు పంపించాడు. భారతి నవ్వి ఊరుకుంది

లంచవరులో భారతి మధుబాబును పలకరించింది.

మధుబాబు సంతోషంతో పొంగిపోయాడు

"మధూ ఒంటరి బ్రతుకు నుండి దూరమై జంటగ నా చెంత చేరే మనసున్న మనిషి నీడలో జాడగా మిగిలిపోవాలని ఓ నిర్ణయం తీసుకున్నాను సాయంత్రం ఇంటికి వస్తే వివరంగా చెబుతాను అంది భారతి...

పగలే వెన్నెలయింది మధుబాబు కళ్ళకు .

ఆ సాయంత్రం .

పట్టలేని ఆనందంతో టిప్‌టాప్‌గా తయారై ఓ మంచి బహుమతి కొనుక్కుని భారతి ఇంటికి వెళ్ళాడు మధుబాబు.

వరండాలో నే ఆగిపోయ్యాడు

పదిమంది ఆడాళ్ళు ముచ్చట్లు చెప్పుకుంటున్నారు. మధ్య మధ్యన భారతి ఏవేవో చెబుతుంది .. మహిళామండలి సభ్యులు కాబోలు.

మధుబాబును చూసి భారతి ఆక్కణ్ణించి లేచి వచ్చి "లోపలకు రా మధూ" అని గదిలోకి తీసుకెళ్ళింది

మధుబాబు కళ్ళకు భారతి రోజూ కంటే మరింత అందంగా కనిపిస్తుంది. ఈ భారతికి పాతికేళ్ళా. కాదు ఇరవై కూడా నిండని కన్నెలా, కలువబాలలా కనిపించింది

కాఫీ కప్పు టీపాయ్ మీద పెట్టింది

"మధూ ... ఈతరం స్త్రీ ఎంత ఎత్తుకు

# మొగలి

మొగలిలాటి చిన్నదానా! కాదు
మొగలులాంటి కొప్పుదానా!
నిన్ను చూచి వెన్నపోలి
కరిగి పోతినే
కన్ను కన్ను కలిపి, నా
వెన్ను తట్టవే!

* * *

తొగరు చీర కట్టి నీవు
తొంగి తొంగి చూస్తుంటే
సిగను పూలు, వగలు పోయి
చిందులేస్తుంటే-
పొగలు క్రక్కి నా గుండె
రగిలి రగిలి పోతోందే!

* * *

మలిసంజను నా పొయలు
మత్తు కలుగ చేస్తుంటే,
తొలి జవ్వన పొంగు తూగి
తూగి చూస్తుంటే-
నిలువలేని నా మనను
నీ దరికే వస్తోందే?

* * *

అందమైన చందమామ
నింగిలోన ఉన్నాడే
అందడే వాడు నాకు
ఓ మొగలి రేకా
అందించు నీ సొగసు
అందాల కుప్పా!

-పైడిపాటి సుబ్బరామశాస్త్రి

# పురుషులందు పుణ్యపురుషులెవరు?

ఎదిగిపోయిందో నీకు తెలుసు. భర్త పెట్టే బాధలకు అతనికి దూరమై ఒంటరిగా తమ జీవితాల్ని అందంగా తీర్చిదిద్దుకొంటున్నారు ఇది ఒక మార్పు. స్త్రీల్లో ఈ మార్పు రావడానికి చాలా దశాబ్దాలు పట్టింది. అయితే ఈ మార్పు అసంపూర్ణం... ఒంటరిగా ఉండి పోవడంలో అర్థం లేదు భార్య వెళ్ళిపోతే ఆ మగాడు నెల తిరక్కుండానే పెళ్ళి కొడుకవుతున్నాడు. తన అనుభవాలకు లోటు లేకుండా చూసుకుంటున్నాడు మరి ఆడది వయసులో నే అన్ని కోరికలు చంపుకోవాలా! ఆమె ఎందుకు మళ్ళీ నవ వధువుగా మారకూడదు? ఈ విషయంలో నీవు సహకరిస్తావని తెలుసు. నీ చేతులు పట్టుకుని ఈలోకంలో ని అన్ని అందాలను చూడగల ధైర్యం నాకుంది అయితే ముందుగా నాకొక మాట ఇవ్వగలవా?"

సూటిగా అడిగింది భారతి

పెళ్ళికి ఆమె అంగీకారం చెప్పగానే ఎగిరి గంతేసినంత పని చేసాడు మధుబాబు

మధూ. వరండాలో కూర్చున్న ఆడవాళ్ళను చూసావు కదా! వాళ్ళెవరో తెలుసా నాలాంటి వాళ్ళు. ఇంకా వివరంగా చెప్పాలంటే అత్తామామలు, భర్తలు పెట్టే బాధలకు దూరంగా వచ్చి తమ నవశక్తి మీద బ్రతుకుతున్న సాహసిమణులు "

అని ఆగింది భారతి

ఆశ్చర్యపోయాడు మధుబాబు.

"ఇంకా వీళ్ళేకాదు . చాలా మంది ఉన్నారు ఈతరం స్త్రీ అని చెప్పగల ధైర్యం వాళ్ళకుంది నీవు చెప్పినట్లుగా కొత్త జీవితంలోకి ప్రవేశించి ఇంకా పొందవలసిన ఆనందాలను దక్కించుకోవాలన్న తపనతో ఉన్నారు మాలో మార్పు రాలేదని మీ మగాళ్ళు అనుకుంటున్నారు వచ్చిందని చెప్పగలం. మరి మీ మగ జాతిలో ఆ మార్పుకు చేయూతనివ్వగల సామర్థ్యం ఎంత వరకూ ఉందో చెప్పగలవా?"

మధుబాబు మూగవాడయ్యాడు

'ఒక మధుబాబు ఒక భారతిని పెళ్ళి చేసుకోవడం వింత కాదు ఒకటి ఎప్పుడూ ఒంటరి అంకెగానే ఉండిపోతే దాని విలువ ఏముంది? ప్రక్కన స్థానాలు పెరిగితేనే కోట్లు కోట్లుగా మారిపోతుంది. నేను నా స్త్రీ జాతిలో మార్పును తీసుకురాగలను మరి నీ మగ జాతిలో ఆ మార్పును తేగలవా! భర్తలు విడిచి పెట్టిన ఈ పదిమంది స్త్రీలలో తిరిగి వెలుగు రేఖలను నింపగల ఓ పదిమంది మగాళ్ళను తీసుకురాగలవా! నీవు తీసుకు రావక్కరలేదు నీ దారిలో నడిపించగలవా!

మాట్లాడలేదు మధుబాబు

మధూ ఒక నెల రోజులు.. పురుషాధిక్యత ఉన్న ఈ సమాజంలో మాలాంటి స్త్రీలకు చేయూతనివ్వగల పుణ్యపురుషులను ఓ పదిమందిని తీసుకు వస్తే నీతో పెళ్ళికి ఆనందంగా ఒప్పుకుంటాను అలా కాని పక్షంలో, మగవాడు అంతటి ఉన్నత స్థాయికి ఎదగలేదని ఒప్పుకుంటే భారతి భారతిగానే మిగిలిపోతుంది'

మౌనంగా తల వంచాడు మధుబాబు

స్త్రీలోని చైతన్యమంతా భారతిలో నే కనిపిస్తుంది?

ఆ చైతన్యం ఏ మగాడిలో కనిపిస్తుంది?

భారతి మాటలను సవాల్‌గా తీసుకుని బయటకు నడిచాడు మధుబాబు... సమాజంలో మార్పు కోరే మగాళ్ళ కోసం వెతకడం ప్రారంభించాడు...

భారతి కోసం కాదు . భావితరాల వారి కోసం..

ఆ మగాళ్ళు ఎవరు మీలో ?

మీరా? మీరా? ఎవరు?

అడుగు ముందుకు వేసే పురుషులందు పుణ్యపురుషులు ఎవరు? ఎవరు? □